




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
డిసెంబరు 24, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## జవాబుదారీతనం లేకపోతే
# చర్యలు తప్పవు

**పనితీరులో మార్పు రావాల్సిందేనని అధికారులకు సీఎం రేవంత్ హెచ్చరిక**

**ప్రతి మూడు నెలలకు స్వయంగా సమీక్ష.. నెలవారీగా సీఎస్ పరిశీలన**

**జనవరి 31 నుంచి పూర్తిగా ఈ-ఫైలింగ్ అమలు**

**అద్దె భవనాలకు గుడ్‌బై.. ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో పనితీరు మెరుగుపడాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అధికారులంతా జవాబుదారీతనంతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చిచెప్పారు. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, సీఎంవో అధికారులతో సీఎం మూడు గంటలకు పైగా సమావేశమయ్యారు. అన్ని శాఖల కార్యదర్శుల పనితీరును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతినెలా సమీక్షిస్తారని, తాను ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తానని సీఎం ప్రకటించారు. ఐఏఎస్ అధికారులు పదిరోజులకు ఒకసారి తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం లేకపోతే ఎంతటి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు రావని ఆయన స్పష్టం చేశారు.

**'తెలంగాణ రైజింగ్-2047' అమలే లక్ష్యం**

గత రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో కొన్ని కీలక విజయాలు సాధించిందని సీఎం తెలిపారు. గతంలో కీలక శాఖలకు స్పష్టమైన విధానాలు లేకపోవడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని,

(మిగతా 2వ పేజీలో)





## నల్లగొండ నుంచే నదీ జలాల అన్యాయంపై పోరు

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకుంటోంది: కేటీఆర్**

**కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ప్రభుత్వానికి లేదు**

**ధైర్యముంటే పరిషత్, సహకార ఎన్నికలు నిర్వహించాలి**

నల్లగొండ : రాష్ట్రానికి నదీ జలాల విషయంలో జరుగుతున్న అన్యాయంపై నల్లగొండ నుంచే పోరాటాన్ని ప్రారంభిస్తామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. డీపీఆర్‌ను కేంద్రం తిరిగి పంపిన అంశంపైనా సీఎం రేవంత్‌రెడ్డి మౌనం పాటించడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. మంగళవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ తరఫున (మిగతా 2వ పేజీలో)



డిసెంబర్ 31న మద్యం దుకాణాలకు

## అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతి

**బార్లు, క్లబ్బులు, ఈవెంట్‌లకు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి**

**జీవో విడుదల చేసిన తెలంగాణ ఎక్సైజ్ శాఖ**

## ఫోన్ ట్యాపింగ్ కేసులో
## కేసీఆర్‌కు సమన్లపై సిట్ ఆలోచన

**హరీశ్‌రావు పాత్రపై కూడా విచారణకు సిద్ధమవుతున్న దర్యాప్తు బృందం**

**'అంతిమ లబ్ధిదారులు ఎవరు?' అన్న కోణంలో విచారణ వేగం**

**ప్రభాకర్‌రావు పునర్నియామకమే కేసుకు కీలక ఆధారంగా మారే అవకాశం**

**శాసనసభ సమావేశాల తర్వాత నోటీసుల జారీపై చర్చ**



హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో దర్యాప్తు కీలక దశకు చేరింది. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసే అంశాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కేసుకు తార్కిక ముగింపు ఇవ్వాలంటే రాజకీయ స్థాయిలోని కీలక నిర్ణయాలపై స్పష్టత అవసరమని సిట్ భావిస్తున్న నేపథ్యంలో, మాజీ మంత్రి హరీశ్‌రావును కూడా విచారించే దిశగా ఆలోచన జరుగుతున్నట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల అనంతరం వీరిద్దరికీ సమన్లు జారీ చేసే అవకాశముందని సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు విచారణలో కీలక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ చర్యలు తన వ్యక్తిగత నిర్ణయం కాదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జరిగాయని ఆయన చెబుతుండగా, ఆయా ఉన్నతాధికారులు మాత్రం అటువంటి ఆదేశాలు ఇవ్వలేదని ఇప్పటికే వాంగ్మూలాలు ఇచ్చారు. దీంతో బాధ్యత ఎవరిది అన్న అంశంపై దర్యాప్తు మరింత లోతుగా సాగుతోంది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన సమీక్ష కమిటీ సభ్యుల వాంగ్మూలాలు కూడా దర్యాప్తులో కీలకంగా మారాయి. ప్రతి సమీక్ష సమావేశానికి ప్రభాకర్‌రావు వేల సంఖ్యలో ఫోన్ నంబర్ల జాబితాలను తీసుకొచ్చేవారని, అవి నిజంగా

(మిగతా 2వ పేజీలో)

## అరెస్టు బెదిరింపులు
## నన్ను ఆపలేవు : హరీశ్‌రావు

**ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో రాజకీయ కక్ష సాధింపు జరుగుతోందని ఆరోపణ**

**నోటీసులు, అరెస్టులు వస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తానని స్పష్టం**



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో తమపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుకు పాల్పడుతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే తనకు నోటీసులు ఇస్తారనే ప్రచారం సాగుతోందని (మిగతా 2వ పేజీలో)

## సభకు దూరంగా ఉంటే
## ప్రతిపక్ష బాధ్యత ఎలా నిర్వర్తిస్తారు?

**రెండేళ్లు అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై డిప్యూటీ సీఎం భట్టి తీవ్ర విమర్శలు**

**ఫాంహౌస్ నుంచి వచ్చి దిగజారుడు ఆరోపణలు సరికావని వ్యాఖ్య**

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ బలం.. ఎన్నికల ఫలితాలే నిదర్శనం**

**పెట్టుబడులు, అభివృద్ధి చూసి భయంతోనే విమర్శలు: భట్టి ఆరోపణ**





## సుప్రీంకోర్టుకు ముగ్గురు
## కొత్త ఏఎస్‌జీలు

**దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడలలకు బాధ్యతలు**




## హెచ్-1బీ వీసాలపై
## ట్రంప్ సంచలన నిర్ణయం

లాటరీ విధానానికి స్వస్తి..
జీతం, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక

2027 ఆర్థిక సంవత్సరం
నుంచి కొత్త నిబంధనల అమలు

భారతీయ నిపుణులపై ప్రభావం చూపే అవకాశం

# జవాబుదారీతనం లేకపోతే చర్యలు తప్పవు



వాటిని గుర్తించి ఇంధన, విద్య, నీటిపారుదల, ఆరోగ్యం, పర్యాటక శాఖలకు ప్రత్యేక విధానాలు రూపొందించామని చెప్పారు. రాష్ట్రానికి స్పష్టమైన దిశ ఉండాలన్న ఉద్దేశంతో 'తెలంగాణ రైజింగ్%–%2047' విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్లు గుర్తు చేశారు. విజన్ అంటే కేవలం ప్రచారానికి మాత్రమే అన్న అపోహను తొలగిస్తూ, అందులో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు ప్రతి నెల సీఎస్‌కు నివేదికలు సమర్పించాలన్నారు. వాటిపై సీఎస్ శాఖల వారీగా సమీక్షించి సీఎంకు నివేదిక ఇవ్వాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక మెకానిజం రూపొందించుకోవాలని సూచించారు.

**ఉద్యోగుల వివరాలు పూర్తి స్థాయిలో ఇవ్వాలి**

రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగులు కలిపి దాదాపు 10 లక్షల మంది పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. వీరందరికీ సంబంధించిన పూర్తి వివరాలను జనవరి 26లోగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయో లేదో శాఖాధిపతులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగేందుకు వీల్లేదని సీఎం తేల్చిచెప్పారు. జనవరి 26లోగా అద్దె భవనాలను ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని ఆదేశించారు. ఖాళీ భవనాలు లేనిచో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి సొంత భవనాల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలోని 113 మున్సిపల్ కార్యాలయాలకు సొంత భవనాలున్నాయా లేదా అన్న వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా సొంత భవనాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని సీఎం హామీ ఇచ్చారు.

**కేంద్ర నిధుల వినియోగంపై దృష్టి**

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) ద్వారా వచ్చే నిధులను అన్ని శాఖలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రం 40 శాతం వాటా చెల్లిస్తే, కేంద్రం 60 శాతం నిధులు ఇస్తోందని, దీని ద్వారా సుమారు రూ.3 వేల కోట్ల వరకు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి కేంద్ర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు, పెండింగ్ అంశాల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, వాటి పురోగతిని ప్రతి వారం సమీక్షించాలని ఆదేశించారు. జనవరి 31లోగా అన్ని శాఖలు పూర్తిస్థాయిలో ఈ%–%ఫైలింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇకపై కాగితాల ఫైళ్లతో తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు.

**విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి**

కోర్ అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. కార్పొరేట్ స్థాయిలో సర్కారు స్కూళ్లలో హాజరు పెంచేందుకు రవాణా సదుపాయం, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను మరింత సమర్థంగా అమలు చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న టీచింగ్ హాస్పిటళ్లను అత్యుత్తమ వైద్య సేవల కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, వాటిని ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌తో అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సమన్లపై సిట్ ఆలోచన

మావోయిస్టుల కదలికలపై నిఘా ఉంచేందుకు సంబంధించినవేనా అని నిర్ధారించుకునే సాంకేతిక వసతులు తమ వద్ద లేవని వారు తెలిపారు. ఎస్ఐబీ ప్రతిష్ఠను నమ్మి ప్రభాకర్‌రావు చెప్పిన వివరాలనే ఆధారంగా తీసుకున్నట్లు వెల్లడించారు. అయితే మావోయిస్టులతో సంబంధం లేని న్యాయమూర్తులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకుల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు ఇప్పటివరకు సరైన సమాధానాలు రాకపోవడాన్ని సిట్ గమనిస్తోంది. ఈ నేపథ్యంలో అక్రమ నిఘా వెనక ఉన్న అసలు అవసరం ఎవరిది అన్నదే ఇప్పుడు దర్యాప్తు కేంద్రబిందువుగా మారింది. ప్రభాకర్‌రావు ఎందుకు ఈ స్థాయిలో రాజకీయ నిఘా పెట్టాల్సి వచ్చిందన్న అంశాన్ని తేల్చగలిగితే, ఈ వ్యవహారంలో లబ్ధి పొందిన వారు ఎవరో స్పష్టమవుతుందని సిట్ భావిస్తోంది. అదే క్రమంలో ఆయన ఉద్యోగ విరమణ అనంతరం కూడా కీలక బాధ్యతల్లో కొనసాగించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా కొనసాగించడం, అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఇంటెలిజెన్స్ విభాగానికి ఓఎస్డీగా నియమించడంపై సిట్ లోతుగా ఆరా తీస్తోంది. ఈ పునర్నియామక ప్రక్రియ వెనకున్న ఉద్దేశమే కేసుకు కీలక మలుపు కావచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌కుమార్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, అలాగే కేసీఆర్‌కు అప్పట్లో ఓఎస్డీగా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేశారు. మరోవైపు ప్రభాకర్‌రావు పునర్నియామకానికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌లో కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. అవసరమైతే రాజశేఖర్‌రెడ్డిని మరోసారి విచారించే అవకాశాన్ని కూడా సిట్ పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, ఈ కేసులో రెండో నిందితుడు ప్రణీత్‌రావు, ఆరో నిందితుడు శ్రవణ్‌రావు మధ్య సమావేశానికి



హరీశ్‌రావు మధ్యవర్తిత్వం వహించినట్లు దర్యాప్తులో వెల్లడైన సమాచారం కూడా సిట్‌ను మరింత అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో హరీశ్‌రావును విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలన్నింటితో ఫోన్ ట్యాపింగ్ కేసు రాజకీయంగా మరింత వేడెక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

# నల్లగొండ నుంచే నదీ జలాల అన్యాయంపై పోరు

గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచుల సన్మాన సభలో కేటీఆర్ మాట్లాడారు. సాగునీటి మంత్రికి నదీ జలాలపై కనీస అవగాహన కూడా లేదని, కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కేసుల రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు%–%రంగారెడ్డి ప్రాజెక్టులో 90 శాతం పనులు పూర్తయ్యాయని కేటీఆర్ గుర్తు చేశారు. మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, వందల హామీల భయంతో ప్రభుత్వం గందరగోళంలో పడిందని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా గులాబీ సైన్యం ఎదురొడ్డి పోరాడి 45 శాతం స్థానాలను గెలుచు కుందని తెలిపారు. ఓటమి భయంతోనే సహకార సంఘాలు, పరిషత్ ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పదవులతో సరిపెట్టుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతుబంధు రూ.15 వేలు, పెన్షన్లు రూ.4 వేలు, మహిళలకు రూ.2,500, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కోరితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడేదే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రశ్నలు ఎదురైతే లీకుల పేరుతో కేసులు పెట్టిస్తూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందన్నారు. 2014లో రాష్ట్ర అప్పు రూ.80 వేల కోట్లు మాత్రమేనని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పుల వివరాలను పార్లమెంట్‌లోనే కేంద్ర మంత్రి వెల్లడించారని కేటీఆర్ చెప్పారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి రూ.8 లక్షల కోట్లు, డిప్యూటీ సీఎం రూ.7 లక్షల కోట్లు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధుకు రూ.73 వేల కోట్లు, కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, మెడికల్ కాలేజీలు, గురుకులాలు, కేసీఆర్ కిట్లు వంటి పథకాలు అమలు చేశామని తెలిపారు. రెండేళ్లలో భారీగా అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఏమి చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. సీఎంకు నిజాయితీ ఉంటే వెంటనే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్రామానికి సర్పంచ్ సీఎం స్థాయిలోనే ముఖ్యమని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో గులాబీ సైన్యం ఐక్యంగా పనిచేసి మరోసారి విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సంచలన నిర్ణయం

**లాటరీ విధానానికి స్వస్తి..**
**జీతం, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక**

**2027 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త నిబంధనల అమలు**

**భారతీయ నిపుణులపై ప్రభావం చూపే అవకాశం**


వాషింగ్టన్: అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న విదేశీ నిపుణులకు కీలకమైన హెచ్–1బీ వీసా విధానంలో ట్రంప్ ప్రభుత్వం సంచలన మార్పులు ప్రకటించింది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న లాటరీ పద్ధతిని రద్దు చేస్తూ, ఇకపై అధిక జీతాలు, ఉన్నత నైపుణ్యాల ఆధారంగా వీసాల కేటాయింపులు చేయనున్నట్లు వెల్లడించింది. అమెరికన్ ఉద్యోగుల వేతనాలు, ఉపాధి అవకాశాలను కాపాడడమే ఈ సంస్కరణల లక్ష్యమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ స్పష్టం చేసింది. ప్రస్తుత లాటరీ విధానాన్ని కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, అమెరికన్లతో పోలిస్తే తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకునేందుకు దీన్ని ఉపయోగిస్తున్నారని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ విమర్శించారు. హెచ్–1బీ కార్యక్రమం అసలు ఉద్దేశం అధిక నైపుణ్యాలు కలిగిన నిపుణులను ఆకర్షించడమేనని, కొత్త విధానం ఆ లక్ష్యాన్ని నెరవేరుస్తుందని ఆయన పేర్కొన్నారు.

**జీతం, నైపుణ్యాలే ప్రాతిపదిక**

కొత్త విధానం ప్రకారం హెచ్–1బీ దరఖాస్తులను ఇకపై యాదృచ్ఛికంగా ఎంపిక చేయరు. దరఖాస్తులను జీతం, నైపుణ్యాల స్థాయిని బట్టి ర్యాంకులుగా విభజించి, ఎక్కువ ర్యాంకు పొందినవారికి వీసాలు కేటాయిస్తారు. తక్కువ జీతాలతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పూర్తిగా తొలగించకపోయినా, అధిక నైపుణ్యాలు ఉన్నవారికి స్పష్టమైన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఏటా జారీ చేసే వీసాల సంఖ్యలో మాత్రం మార్పు లేదని, సాధారణ కోటాలో 65,000 వీసాలు, అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి అదనంగా 20,000 వీసాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కొత్త నిబంధనలు ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి రానుండగా, 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్–1బీ రిజిస్ట్రేషన్లకు వర్తింపజేయనున్నారు. వీసా వ్యవస్థను సమూలంగా సంస్కరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాల్లో ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. ఇటీవల వీసా అర్హత కోసం యజమానులు అదనంగా లక్ష డాలర్లు చెల్లించాలనే నిబంధనను కూడా తీసుకురావడం గమనార్హం.

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్‌చౌహాన్ వ్యాఖ్య

స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.







# తాజ్ పూర్ విజేతకు అభినందనల వెలువ

## ఆర్ ఎస్ కె ఫౌండేషన్ సేవలకు
## దక్కిన ఘనవిజయం- ప్రముఖుల వాక్య

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ గా విజయానికి తోడుగా నిలిచిన యువనేత,సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి, ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు ప్రముఖ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, భువనగిరి మండల వ్యాప్తంగా మీ ఆర్ ఎస్ కే ఫౌండేషన్ సేవలకు తాజ్ పూర్ గ్రామమే కాదు, మీకోసం.! మీ సేవల కోసం.!నేటి సమాజంలో సేవ చేసే వారికి అత్యున్నత పదవులలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని ర్యాకల శీనన్నతో పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు తెలిపారు



# దేవరకొండలో బంగ్లాదేశ్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం

## విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

దేవరకొండ డిసెంబర్ 23 వార్తా మిర్రర్ : దేవరకొండ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసన ర్యాలీని పట్టణంలోని ఐబి బంగ్లా నుండి కోర్టు వరకు నిరసన ర్యాలీని చేపట్టారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లో బంగ్లాదేశ్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సంపత్ వర్మ సహకార దర్శి ముంత రామకృష్ణ గుంటోజూ రామకృష్ణ నగర ఉపాధ్యక్షులు నీల సంజీవ్ కుమార్ నగరసంచాలకు పోలిశెట్టి వెంకటేశ్వర్లు అయ్యప్ప స్వామి దేవాలయ గౌరవ అధ్యక్షులు చిలువేరు చంద్రమౌళి గురు స్వామి గీత సత్సంగ్ అధ్యక్షులు నీల పాండరయ్య భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సుధాకర్ ఆర్ఎస్ఎస్ వీహెచ్పీ బీజేపీ నాయకులు కార్యకర్తలు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# సభకు దూరంగా ఉంటే ప్రతిపక్ష బాధ్యత ఎలా నిర్వర్తిస్తారు?

విమర్శలు చేయడం ప్రజాస్వామ్యానికి తగదని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో రూ.10.53 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేసిన అనంతరం, సత్తుపల్లిలో సింగరేణి ఏరియా జీఎం కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందువల్లే పంచాయతీ ఎన్నికల్లో 85 శాతం మంది సర్పంచ్‌లుగా కాంగ్రెస్ మద్దతుదారులే గెలిచారని ఆయన పేర్కొన్నారు. తమకు దిగజారి మాట్లాడే రాజకీయాలు అలవాటు లేవని, ప్రజా సంక్షేమం ద్వారానే బీఆర్ఎస్ నేతలకు సమాధానం చెబుతామని భట్టి వ్యాఖ్యానించారు. 'రెండేళ్లు ఫాంహౌస్‌లో ఉండి, ఇప్పుడు మీడియా ముందుకొచ్చి తోలు తీస్తాం అని మాట్లాడటం సరికాదు. తోలు వలుస్తామంటే ఇక్కడ ఎవరూ ఖాళీగా లేరు. అలాంటి మాటలు చెప్పే అధికారం ఆయనకు ఎప్పుడు ఎవరు ఇచ్చారు?' అంటూ భట్టి వ్యంగ్యంగా ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రావడానికే భయపడుతున్నారని, అలాంటప్పుడు ఆ హోదా అవసరమా అనే విషయాన్ని కేసీఆర్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తుండటంతో తమ రాజకీయ భవిష్యత్తు కనుమరుగవుతుందనే భయంతోనే కేసీఆర్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని భట్టి ఆరోపించారు. మీడియా ముందు మాట్లాడి మళ్లీ ఫాంహౌస్‌కే వెళ్లిపోవడం ద్వారా ప్రజల పట్ల ఉన్న బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి భవిష్యత్తు ప్రణాళికలపై భట్టి మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రైవేట్ సంస్థలతో పోటీ పడుతూనే సింగరేణిని బహుముఖంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాపర్, గోల్డ్ మైనింగ్ రంగాల్లోనూ సింగరేణి అడుగుపెట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావులకు వేలం నిర్వహించినా, తెలంగాణలో ఒక్క బావి కూడా ఇతరులకు వెళ్లకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించిందని భట్టి స్పష్టం చేశారు.

# సేంద్రియ ఎరువులపై కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఏది...

**పప్పు దినుసులు, నూనె గింజలకు క్వింటాల్ కు వేయి బోనస్ అందించాలి**

**సేంద్రియ ఎరువుల తయారీ పై ఎకర 4వేల రాయితీ కల్పించాలి**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23 : రసాయన ఎరువులు, మందు బస్తాల వినియోగం తగ్గించాలని కొరుత పెట్టి కేంద్ర ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు రాయితీ అందించి ఎందుకు ప్రోత్సహించడం లేదని మాజీమంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజి రైతు గోనె రెడ్డి సంఘం 40 మంది రైతులను శాలువా, మెమొంటో అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతన్న దేశానికి వెన్నెముక లాంటివారని పలు రకాల పరిశ్రమలకు ముడి సరుకులను అందిస్తున్నారన్నారు. వస్త్ర పరిశ్రమ మొదలుకొని మందుల పరిశ్రమల వరకు రైతుల భాగస్వామ్యాన్ని వర్ణించలేమన్నారు. ఎండ, వాన, చలి అని తేడా లేకుండా కష్టపడుతున్న కర్షకులను గుర్తించి ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదుకోవాలని అన్నారు. నాడు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును అందించి రైతులను ఆదుకున్నారని పేర్కొన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పప్పు దినుసులు, నూనె గింజలు పండించిన రైతులకు క్వింటాలకు 200 బోనస్ అందించిన మాదిరిగా పెరిగిన ధరలకు అనుగుణంగా నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పప్పు దినుసులు, నూనె గింజలు పండించిన రైతులకు క్వింటాలకు రూ.1000 బోనస్ అందించాలన్నారు. నేడు రైతుల ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కోతుల బెడదని ఆరుతడి పప్పు దినుసుల పంటను ప్రోత్సహించాలంటే పంటకు నష్టాన్ని కలిగించే కోతుల పునరుత్పత్తి ఆపే ప్రయత్నం చేపడితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. రసాయన ఎరువులు తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వం సేంద్రియ ఎరువుల తయారీకి ఎకరాకు రూ.4 వేలు రాయితీని రైతులకు అందించి ప్రోత్సహించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు ఆన్లైన్ బుకింగ్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్, శివాజి రైతు గోనె రెడ్డి సంఘం అధ్యక్షులు కుంబాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి జిల్లాల మల్లారెడ్డి, కోశాధికారి కడపటి రాజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు జిల్లాల రాజిరెడ్డి, జిల్లాల గంగారెడ్డి, దమ్మ గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, సభ్యులు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, మచ్చ శేఖర్, కొయ్యడి మహిపాల్, దాసరి గంగాధర్, కొమ్ముల ఆది రెడ్డి, బొమ్మకంటి నవీన్, కుర్మ సుదర్శన్, జిల్లాల సూర్యం, రైతు నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# జగిత్యాల నీలకంఠ రైతు ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ లో ఘనంగా రైతు దినోత్సవం




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23 : జగిత్యాల మండలం గుల్లపేట లో జగిత్యాల నీలకంఠ రైతు ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని చౌహాన్ చరణ్ సింగ్ జయంతి నీ పురస్కరించుకొని"జాతీయ రైతు దినోత్సవం" కార్యక్రమం ఘనంగా జరుపుకోవటం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ రావడం జరిగింది. ఈ సందర్భంగా డిఏఓ మాట్లాడుతూ ఎఫ్ పి ఓ నాబార్డ్ సహకారంతో జగిత్యాల రూరల్ మండలంలో గుల్లపేట కేంద్రంగా చుట్టూ పది గ్రామాల రైతులు కలిసి జగిత్యాల నీలకంఠ ఎఫ్ పి ఎల్ సి ను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఒక్కో రైతు షేర్ అమౌంట్ గా 2000 రూపాయల చొప్పున ఇప్పటి వరకు 400 మంది రైతులు కలిసి 8,00,000 రూపాయలు జమ చేయడం జరిగింది.ఈ ఎఫ్ పి ఓ మెయింటైన్ చేయడానికి నాబార్డ్ నుండి మూడు సంవత్సరాలకు కలిపి 18 లక్షల డబ్బులు కూడా విడుదల చేస్తారు. ఈ విధంగా 750 మంది రైతులు కలిసి 15 లక్షల రూపాయలు జమ చేస్తే నాబార్డ్ నుండి 15 లక్షల గ్రాంట్ ఎఫ్ పి ఓ కి లభిస్తుంది. ఆ డబ్బులతో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు రైతులకు తక్కువ ధరలకు అందించడం జరుగుతుంది. అంతేకాకుండా జగిత్యాల నీలకంఠ ఎఫ్ పి ఓ లో వరి వితనోత్పత్తి ప్రారంభించినదుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. అలాగే చరణ్ సింగ్ జయంతి నీ పురస్కరించుకొని సీడ్ విత్తన ఉత్పత్తి చేసిన రైతులను సన్మానించడం జరిగింది. ఇక ఈ కార్యక్రమానికి గుల్లపేట సర్పంచ్ పడిగెల శంకర్ రెడ్డి, పొలాస సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, సంఘం పల్లె సర్పంచ్ అంకతి మల్లయ్య, తక్కల పెల్లి సర్పంచ్ వడ్లూరి శంకరవ్వ, అనంతరం సర్పంచ్ బత్తిని రవిన మహేష్ , గుట్రాజుపల్లె సర్పంచ్ వాసాల మల్లేష్, అర్ప పెల్లి సర్పంచ్ సొల్లు సురేందర్, హబ్సిపూర్ సర్పంచ్ ఇండ్ల జమున ముఖ్య అతితులు గా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో కంపెనీ చైర్మన్ దమ్మ గంగారెడ్డి, వైస్ చైర్మన్ పొడేటి లక్ష్మణ్ డైరెక్టర్స్ గంగాధర లావణ్య, బద్దం రాజశేఖర్ రెడ్డి, ఏలేటి తిరుపతి, లోని రెడ్డి, గుర్రాల రవి, గడ్డం వేణుగోపాల్ రెడ్డి, భూషి మహేష్, నత్తి వినోద్ కుమార్, గంగుల కొమురయ్య, మానాల లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు...

# నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ( జిఎస్ఐ) లో పర్యటించిన

**జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్**



ఎల్బీనగర్, 23 డిసెంబర్:జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్.సి.ఎస్.టి) సభ్యుడు జటోతు హుస్సేన్ మంగళవారం హైదరాబాద్ నాగోల్ బండ్లగూడ లో ని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జి.ఎస్.ఐ) సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. బాసబ్ ముఖోపాధ్యాయ, ఎ.డి.జి. %ఢ% హెచ్.ఓ.డి. జిఎస్ఐ యొక్క ఇతర సీనియర్ అధికారులు జటోతు హుస్సేన్ కి హృదయపూర్వక స్వాగతం పలికారు. జటోతు మహాత్మా గాంధీ మరియు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు, బంకిమ్ చంద్ర చటర్జీ, బిర్సా ముండా, కుమారం భీమ్ల చిత్రాలకు పుష్ప నివాళులు అర్పించి, దేశ నిర్మాణానికి, సామాజిక సంస్కరణలకు వారు చేసిన కృషిని ప్రశంసించారు. మొక్కను తరుఆ తరువాత సంస్థ ప్రాంగణంలో "ఏక్ పెడ్ మా కే నామ్" భాగంగ మొక్కను నాటారు. ఆ తర్వాత విలియం కింగ్ జియోలాజికల్ మ్యూజియాన్ని సందర్శించి, వివిధ రాళ్ళు, ఖనిజాలు, ఖనిజాలు, లోహాలు మరియు శిలాజాల నమూనాలను పరిశీలించారు.తదనంతరం జటోతు హుస్సేన్ షెడ్యూల్డ్ తెగ ఉద్యోగులు మరియు ఎస్సి/ఎస్టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లతో ఇక్కడ సేవా పరిస్థితులు, సంక్షేమ చర్యలు గురించీ చర్చించారు. ఎస్సి %ఢ% ఎస్టి ఉద్యోగుల సంక్షేమం కోసం జిఎస్ఐ తీసుకుంటున్న వివిధ చర్యలను ప్రశంసించారు. ఈ సందర్భంగా జటోతు హుస్సేన్ మట్లాడుతూ ప్రభుత్వ సంస్థలలో సమాన అవకాశాలు, శ్రమ గౌరవం మరియు రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. మరియు ఎస్సి %ఢ% ఎస్టి ఉద్యోగుల సంక్షేమం కోసం జిఎస్ఐ తీసుకుంటున్న వివిధ చర్యలను ప్రశంసించారు. సభ్యుడిని జీఎస్ఐ యాజమాన్యం రంగ సత్కరించింది. ఈ కార్యక్రమంలో జిఎస్ఐసీనియర్ భూవిజ్ఞాన శాస్త్రవేత్త %ఢప్రజా సంబంధాల అధికారి (పి.ఆర్.ఓ) డాక్టర్ మల్లేష్ గంజి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత

**సర్పంచ్ నీరటి శ్రీనివాస్...భగవద్గీతల ప్రదానం...**

**ఇటిక్యాల సర్పంచ్ కు, నూతన పాలకవర్గానికి ఘన సన్మానం**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23 : ఇటిక్యాల గ్రామపంచాయతీకి నూతనంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, ముఖ్య అతిథితులు మాజీ ఎం.పి.పి కాటిపెల్లి గంగారెడ్డి, మాజీ యంపిటిసి కొమ్ము ఆదిరెడ్డి, బి.సి. సంఘం అధ్యక్షులు జాతీయవాది రొట్టె శ్రీనివాస్ లతో పాటు వార్డు సభ్యులు బద్దం సుజాత, ఎల్లాల సరిత, వేల్పుల రమ్య, నిగ భూమేశ్వర్, ఊట్నూరి నరేష్, ఏలేటి లావణ్య, మామిడి లావణ్య యాదవ్, నేతుల రాజేందర్ యాదవ్, కొక్కర రాజేందర్ యాదవ్, బిచ్చల ధనుంజయ్, ఓరుగంటి శేఖర్, మలాన్ అబ్దుల్, కుంచం గణేష్ లను ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్షాన ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్ ఘనంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం టి.వై.ఎం.ఎస్.ఈ.యు రాష్ట్ర శాఖ అధ్యక్షులు, ఆర్.యు.పి.పి జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ భగవద్గీతలు ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, పాఠశాలల పరిరక్షణ ద్వారానే నిరుపేద, బుడుగు, బలహీన వర్గాలకు విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని, ప్రజాప్రతినిధులు అందరితో కలుపుగోలుగా పాలన కొనసాగిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాజెంగి రాజేశం, ఎద్దండి రమేష్, జియావుద్దీన్, హనుమంతరావు, స్వర్ణలత, రౌతు నీరజ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ ను సన్మానించిన మంత్రి అట్లూరి లక్ష్మణ్

**హాజరైన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా యాదిగిరి గుట్ట మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్లో నూతనంగా గెలిచినటువంటి సర్పంచులను ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య గారి ఆధ్వర్యంలో నూతనంగా గెలిచినటువంటి జేతురం తండా సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ ని మంత్రి అట్లూరి లక్ష్మణ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చేతులమీదుగా, ఘనంగా సన్మానించడం జరిగింది.వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని కావాల్సిన నిధులు ఇస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా మంత్రివర్యులు అట్లూరి లక్ష్మణ్, మరియు బోనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మరియు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు,



## ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం.

మిర్యాలగూడ డిసెంబర్ 23:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామాలలో గల గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం ఈ నెల 23 నుండి 31 వరకు ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ద్వారా రైతులకు అందజేయడం జరుగుతుందని మిర్యాలగూడ మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎన్.దుర్గారమాదేవి తెలిపారు. కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలగడప, తుంగపాడు, నందిపాడు గ్రామాలలో గల 3,325 జీవాలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఇంద్రపల్లి కుమారి, బెడుదూరి వెంకట్ రెడ్డి, మిర్యాలగూడ సహాయ సంచాలకులు డాక్టర్ శంకర్రావు, తుంగపాడు పశు వైద్యాధికారి డా.జ్ఞానేశ్వర్ ప్రసాద్, జెవిఓ కృష్ణ, ఎల్ఎస్ఏలు నాగరాజు యాదవ్, నాగేందర్, శ్రీకాంత్, వీఏలు అజార్, సుభాన, ఓఎస్లు,గోపాలమిత్రలు పాల్గొన్నారు.



## ఆలూరు లో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

**కర్షకులకు ఐదు వేల పెన్షన్ ఇచ్చి రైతును గౌరవించాలి**

**జిల్లా రైతు నాయకులు మెక్కొండ రాంరెడ్డి**

**అభ్యుదయ రైతులకు సర్పంచ్ నల్లాల స్వామి సన్మానం**

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు లో జాతీయ రైతు దినోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని అభ్యుదయ రైతులకు సర్పంచ్ నల్లాల స్వామి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం జిల్లా రైతు నాయకులు మెక్కొండ రాంరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. పట్టేదార్ పాస్ బుక్ ఉన్నవారే రైతులుగా గుర్తించడం సరికాదు. వ్యవసాయంలో కూలీలు లేకుండా పంట తీయడం అసాధ్యం. రైతులకు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్నవారందరికి రైతు భీమా వర్తింప చేయాలి. వృత్తికి విరమణ లేని దేశానికి అన్నం పెడుతున్న కర్షకులకు ఐదు వేల పెన్షన్ ఇచ్చి రైతుకు గౌరవాన్ని ఇవ్వాలని కోరారు. పెట్టుబడికి ఒకటిన్నర రేట్లు దిగుబడి వచ్చినప్పుడే గిట్టుబాటు అవుతుంది కాని ప్రకృతి ద్వారా నష్టానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమం లో పెకుడ మహేష్, ఎలిపెద్ది రాజు, నారాయణ, మల్లయ్య, జనార్దన్, మల్లారెడ్డి, చాంద్, రామచంద్రుడు, రాజేష్. తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి

**ఆలయ నూతన చైర్మన్ గా సుర్వి యాదయ్య గౌడ్**

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 23, ( వార్త మిర్రర్) :యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామపంచాయతీలో గల శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయములకు సోమవారం రోజున నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో నూతన చైర్మన్ గా సుర్వి యాదయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాభి శిల బొడ్రాయి అభిషేకం చేయడం జరిగింది. అనంతరం గ్రామ పెద్దలు మరియు పాత కమిటీ మెంబర్స్ సమక్షంలో సుర్వి యాదయ్య గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, పాత కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర స్టాండింగ్ కౌన్సిల్ గా - బాల్యం వెంకటాచలపతి ఎన్నిక

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్ గా చౌటుప్పల్ కు చెందిన బాల్యం వెంకటాచలపతి ఎన్నికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నియమించడం జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి అన్ని శాఖలకు వారు కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా మూడు సంవత్సరాలు కొనసాగుతారని సర్కులర్ ద్వారా నియమించడం జరిగింది. ప్రస్తుతం బాల్యం వెంకట చలపతి చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు



## కొనసాగుతున్న సుంకిరెడ్డి - ఉచిత కంటి వైద్య శిబిరం

కల్వకుర్తి డిసెంబర్ 23 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి నియోజకవర్గ మాడుగుల మండల కేంద్రంలో శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ లో గ్రామీణ ప్రాంత పేద ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తూ ప్రముఖ వైద్య నిపుణులు శంకర నేత్రాలయ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిభిరం సేవలు మూడవ రోజు ప్రజల భారీ స్పందనతో విజయవంతంగా కొనసాగుతున్నాయి. మంగళ వారం ఉచిత కంటి వైద్య శిభిరానికి దాదాపుగా 700 మందికి పైగా సందర్శించగా464 మందికి ఉచిత కంటి పరీక్షల నిర్వహణ 280 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ 20 మంది పేషెంట్లను కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ఐక్యత మాడుగుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి మాట్లాడుతూ."సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారు ఐక్యత ఫౌండేషన్ ద్వారా సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా కార్యక్రమంలో బాగంగా,గ్రామాల్లో ఉచిత హెల్త్ క్యాంప్ లు మరియుమండలాల వారిగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నారని,ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనే గ్రామీణ ప్రాంతాల్లో కంటి శిభిరం యొక్క అవశ్యకత తెలియజేస్తుంది,ఇలాంటి సేవా కార్యక్రమాలు ఐక్యత ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగుతాయని,మూడు రోజులుగా ఈ శిబిరాన్ని 1450 మందికి పైగా సందర్శించగా,980 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా, 640 మందికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయగా,39 మంది పేషెంట్లను కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ మాడుగుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డితో పాటు ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, యాదయ్య,శ్రీపతి, శేఖర్, శ్రీను, నాగిళ్ళ శివ, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వపరంగా క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలి

### నేడు ప్రభుత్వ క్రిస్మస్ విందు

### నిర్వహణపై నియోజకవర్గ స్థాయి సమావేశంలో అదనపు కలెక్టర్ అమిత్



మిర్యాలగూడ డిసెంబర్ 23:- (వార్త మిర్రర్) ప్రభుత్వపరంగా ఈ నెల 24న పట్టణంలోని ఎఆర్సి గార్డెన్స్ లో క్రిస్మస్ నిర్వహించే విందును జయప్రదం చేయాలని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ క్రిస్మస్ విందు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను శాంతి యుతంగా, సౌహార్దపూర్వకంగా నిర్వహిస్తూ ప్రజా శాంతిభద్రతలను కాపాడాల్సిన అవసరాన్ని వక్కాణించారు. అదేవిధంగా నియోజకవర్గంలో క్రైస్తవులందరికీ తెలియజేయాలని కోరారు. విందు సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.స్థానిక డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు మాట్లాడుతూ భద్రతకు సంబంధించిన అంశాలపై వివరించి, పండుగ సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో పూర్తి సహకారం అందించాలని కోరారు.క్రిస్మస్ వేడుకలు, ప్రార్థనలు, విందులు, ఊరేగింపులు సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా శాంతియుతంగా నిర్వహించాలన్నారు. నిర్వాహకులు సంబంధిత అధికారుల ద్వారా మంజూరు చేయబడిన అనుమతులను కచ్చితంగా పాటించాలన్నారు.కార్యక్రమ స్థలాల్లో జన సమూహ నియంత్రణ, పార్కింగ్, పారిశుధ్యం, అగ్నిమాపక భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ఏవైనా సమస్యలు లేదా అవసరాలు తలెత్తినట్లయితే వెంటనే స్థానిక పరిపాలన అధికారులకు లేదా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చర్చిల ప్రతినిధులు క్రిస్మస్ వేడుకలను క్రమశిక్షణతో శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.సమావేశంలో డిఎఓ శ్రీనివాసశర్మ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, అన్ని సంబంధిత శాఖల అధికారులు, నియోజకవర్గంలోని చర్చిల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, పోస్టర్స్ పాల్గొన్నారు.

# రైతు కుటుంబం నుండి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రైతు పక్షపాతి

### ఎంఎల్ఏ డా. సంజయ్ కుమార్

### ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం

### పొలాస లో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్)



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస లో మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవం (కిసాన్ దివస్) కార్యక్రమం లో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా మాజీ ప్రధాని చరణ్ సింగ్ చిత్ర పటానికి పూలు సమర్పించి ఘన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వకాలపు సంప్రదాయ నత్రజనినీ మనం వాడడం మర్చిపోయాం..రైతు కుటుంబం నుండి వచ్చిన ముఖ్యమంత్రి రైతు పక్షపాతి. ఆధునిక టెక్నాలజీ వాడడం,ఆన్లైన్ లో వ్యవసాయ పద్ధతులు పాటించడం తో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవడం మంచిది. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియా రావడం జరిగింది అని కొందరు ఉద్దేశ పూర్వకంగా అసత్య ప్రచారాలు చేయటం వల్ల కొందరు రైతులు ముందస్తు యూరియా నిల్వ చేసుకోవడం వల్ల కృత్రిమ కొరత ఏర్పడడం జరిగింది. జగిత్యాల లో యూరియా కొరత లేకుండా చూడడం జరిగింది అని అధికారులను అభినందించారు. ఎఫ్ పి ఓ లకు సైతం ప్రభుత్వం యూరియా సరఫరా చేసింది. రైతు సంఘాలు బలోపేతం కావలసిన అవసరం ఉంది. ఎఫ్ పి ఓ లు, సొసైటీ లు, మహిళా సంఘాలు సైతం రైతులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసి రైతులకు కిరాయి పద్ధతిలో పంపిణీ చేసి ఆదాయం పొందాలి..రైతులకు లాభం చేకూర్చాలి. ప్రభుత్వం అన్ని చేయలేదు ఎఫ్ పి ఓ లు సహకార సంఘాలు కూడా రైతుల గురించి ఆలోచన చేయాలి. రైతులు ఉత్పత్తులను దళారులను నమ్మి మోసపోవద్దు...రైతులు మార్కెటింగ్ లో మెలకువలు పొందాలి అప్పుడే ఆదాయం రావడం జరుగుతుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలో 4.5 కోట్ల తో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టిన నిరుపయోగంగా ఉంది. రైతులు ముందుకు రావాలి.రైతులు హోల్ సేల్ వ్యాపారస్తులుగా మారాలి..ప్రభుత్వం రైతు నేస్తం,రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను రైతులు ఉపయోగించుకోవాలి...రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రైతు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. రైతులు అత్యాధునిక పద్ధతులు ఉపయోగించుకోవాలి. భూసార పరీక్షలను రైతులు ఉపయోగించుకోవాలి..డిమాండ్ తగ్గట్లు పంటలు పండించినపుడు రైతులకు లాభం కలుగుతుందని, మంచి నాణ్యమైన ఉత్పత్తులతో ఎగుమతులు చేపట్టి ఆదాయం పొందవచ్చు అని రైతులు ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ హరీష్ కుమార్ శర్మ, డీన్ భారతి, ఏడిఏ భాస్కర్, పొలాస సర్పంచ్ శంకరయ్య, మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి, మహేశ్వర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, కట్ట రాజేందర్, సురేందర్ నాయక్, చిర్ర నరేష్, ములసపు మహేష్, దమ్మ సురేందర్ రెడ్డి, దనేశ్వర్ రావు, రాజేశ్వర్ రెడ్డి, రాజీరెడ్డి, మహేష్, హరీష్, గంగారెడ్డి, రామ్ రెడ్డి, మల్లేశం, శాస్త్ర వేత్తలు, విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం నూతన భవనం నిర్మాణం చేయాలి...

### బీజేపీ అధ్యక్షులు హఫీజ్ పేట్ డివిజన్ కైతాపురం జితేందర్....



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లోని రంగారెడ్డి జిల్లా సీ.డి.పీ.ఓ జ్యోతి మంగళవారం నాడు హఫీజ్ పేట్ డివిజన్, సాయి నగర్ బస్తీ లోనీ అంగన్వాడీ కేంద్రం ఉన్న స్థలంలో ప్రహరీ గోడ తో నూతన భవనం నిర్మాణం చేయాలి అని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ మాట్లాడుతూ....సాయినగర్ బస్తీలో అంగన్వాడీ కేంద్రంను రంగారెడ్డి జిల్లా సీడీపీఓ జ్యోతి తప్పక సందర్శించి , కిర్బీ షీట్లతో రూమ్ ఏర్పాటు చేసి రూములో కరెంట్ వసతి లేక , బాత్రూం లేక , చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు, మరియు అంగన్వాడీ కేంద్రం ముందర మస్కా కుంట చెరువు ఉండడం, ప్రహరీ గోడ లేక పోవడం ప్రమాదకరంగా మారిందని అక్కడ కనీస వసతులు లేక చాలా ఇబ్బందిగా ఉంటున్నారు,కావున అంగన్వాడీ కేంద్రం ఉన్న స్థలాన్ని ప్రభుత్వం ప్రహరీ గోడతో నూతన భవనం నిర్మించాలని, స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలి వారు కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి అజిత్ సేనాపతి , బీజేపీ జిల్లా గీతా సెల్ కన్వీనర్ రవి గౌడ్ , హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్ , బీజేపీ నాయకులు కార్తీక్ , లోకేష్ ,మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ.5 రూపాయలకే రుచికరమైన టిఫిన్

### పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాధవ నగర్ కాలనీ మియాపూర్ చౌరస్తా లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ లో 5.రూపాయలకే ఆల్పాహారం పథకం ను డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ , ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి , ఏ.ఎమ్.ఓ.ఎచ్. రవి కుమార్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి ల తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీ ఏ సీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ..ఇందిరమ్మ క్యాంటీన్లలో నేటి తో రుచికరమైన టిఫిన్ కూడా అందుబాటులోకి రానుంది అని, పేదవాడు ఉదయం పూట అర్ధ ఆకలి తో ఉండకూడదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో ఆల్పాహారం పథకం ప్రవేశపెట్టడం జరిగినది. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ఇడ్లీ, పూరీ, వడ, ఉప్మా, పొంగల్ వంటి టిఫిన్లను ప్రజలకు అందించనున్నారు అని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి అని,ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి ఉదయం పూట ఆల్పాహారం , మధ్యాహ్నం భోజనం కేవలం 5 రూపాయలకే చక్కటి రుచికరమైన టిఫిన్ మరియు బోజనం అందిస్తుంది అని తెలియచేసారు. ఈ చక్కటి అవకాశం ను చుట్టుపక్కల పరిసర ప్రాంత వాసులు, ప్రయాణికులు, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. పేదలు ఆకలితో అలమటించొద్దనే ఏకైక ఉద్దేశంతో నగరంలో రాష్ట్ర ప్రభుత్వం మరి కొన్ని ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేశారని. రోజు భోజనాలను ఈ క్యాంటీన్ల ద్వారా పేదలు ఆకలి తీరుస్తాయి అని వీటిని సద్వినియోగ పర్చుకోవలని గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు కార్యకర్తలు, కాలనీల వాసులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి ..

### షిర్డీ సాయి సేవా సమితి అధ్యక్షుడు అనిల్ కుమార్..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి తమ కాళ్ళ పై తాము నిలబడాలని షిర్డీ సాయి సేవా సమితి ప్రెసిడెంట్ అనిల్ కుమార్ అన్నారు. అక్షయ శక్తి వెల్ ఫేర్ అసోసియేషన్, అక్షయ దాగా ఆధ్వర్యంలో బి హెచ్ ఇ ఎల్ టౌన్ షిప్ లోని షిర్డీ సాయి బాబా దేవాలయ ప్రాంగణంలో ఉచితంగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పట్టుదలతో శిక్షణ పూర్తి చేసుకున్న వారు అదే పట్టుదలతో ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని సూచించారు. అక్షయ శక్తి సి ఈ ఓ. నారాయణ్ ఏబి అయ్యర్ మాట్లాడుతూ మహిళల సాధికారికత కోసం దేశ వ్యాప్తంగా 94 సెంటర్లలో 12 వేల మంది కి శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండాలని, అందుకే ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నేర్చుకున్న విద్యను వృధా చేయకుండా తమ పక్కవారికి కూడా సహాయ పడాలని శిక్షకురాలు నాగమణి తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో కలిపి 2030 వరకు ఒక మిలియన్ మంది కి శిక్షణనివ్వడానికి ప్రణాళికలు వేసుకున్నామన్నారు. ఇప్పటికీ రెండు బ్యాచ్ లు పూర్తయ్యాయని త్వరలోనే మూడో బ్యాచ్ మొదలు పెడతామన్నారు. ఒక్కో బ్యాచ్ కు 60 మంది ఉంటారని, ఎవరైనా నేర్చుకోవాలనుకుంటే రావొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాం రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, యువరాణి, రాజేష్ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 21వ వర్ధంతి..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 21 వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ ఆర్థిక రాజకీయ పరివర్తనకు కీలకమైన సమయంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని, భారత అభివృద్ధికి బలమైన పునాది వేసిన మహానేత పీవీ నరసింహారావు అని కొనియాడారు.ఆర్థిక సంస్కరణల ద్వారా దేశాన్ని ప్రపంచ పటంపై నిలిపిన ఘనత పీవీ దేనని వారి దూరదృష్టి, సంస్కరణాత్మక ఆలోచనలు నేటికీ దేశానికి మార్గదర్శకమని తెలిపారు. పీవీ నాయకత్వం, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, మన్నేపల్లిసాంబ శివరావు, వెంకట్రావు,రాజన్,కట్ల శేఖర్,సయ్యద్ గౌస్, అశోక్,కావూరి ప్రసాద్,శేఖర్ ముదిరాజ్, లక్ష్మణ్, గంగల గణేష్, సుదర్శన్, ముజీబ్, వాసు, శ్రీనివాస్ ,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



### సైబరాబాద్ లో తగ్గిన నేరాలు...

### 2025 వార్షిక నివేదికను వెల్లడించిన సిపి అవినాష్ మహంతి......



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : గచ్చిబౌలిలో జరిగిన సైబరాబాద్ పోలీస్ వార్షిక ప్రెస్ మీట్%-%2025లో కమిషనర్ అవినాష్ మొహంతి సీనియర్ అధికారులతో కలిసి మాట్లాడారు. 2025లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మొత్తం కాగ్నిజబుల్ నేరాలు 2024లోని 37,689 కేసుల నుంచి 37,243కి తగ్గి 1.18 శాతం స్వల్ప తగ్గుదల నమోదైనట్లు వెల్లడించారు. మొత్తం నేరాల్లో సైబర్ నేరాలు ఇంకా అతిపెద్ద వర్గంగానే ఉన్నప్పటికీ, వాటి వాటా 2024లోని 32 శాతం నుంచి 21 శాతానికి గణనీయంగా తగ్గింది. సైబర్ నేరాల కేసులు 11,914 నుంచి 7,636కి పడిపోవడంతో పాటు ఆర్థిక నష్టం కూడా ?793.18 కోట్ల నుంచి ?404.61 కోట్లకు తగ్గిందన్నారు. పెరిగిన నిఘా, లక్ష్యిత అమలు డ్రైవ్‌లు, సాంకేతికత వినియోగం, ప్రజల్లో అవగాహన, హెల్ప్‌లైన్ 1930కి సత్వర ఫిర్యాదులు ఇవ్వడం, బ్యాంకులు%-%డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో సమన్వయం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. అయితే ఆస్తి నేరాలు 12 శాతం నుంచి 15 శాతానికి, రోడ్డు ప్రమాదాలు 10 నుంచి 12 శాతానికి పెరిగాయని, మహిళలపై నేరాలు, దాడులు స్వల్పంగా పెరిగినట్లు పేర్కొన్నారు. గతేడాది నేరాలు దాదాపు 70 శాతం పెరగడం గణాంకాలను వక్రీకరించిందని, ప్రస్తుతం పరిస్థితి సాధారణీకరణ దిశగా వెళ్తోందని కమిషనర్ స్పష్టం చేశారు.



### శిల్పారామం లో ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేలా

మాదాపూర్ వార్త మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళ లోని చేనేత చీరలు ప్రత్యేకంగా మహిళలను ఆకట్టుకుంటున్నవి. పటోళ్లచీరలు, అజరాక్ అద్దకం చీరలు, పెన్ కలంకారీ చీరలు, కాశ్మీరీ చీరలు, బెంగాలీ కాటన్ , బందీని చీరలు, పోచంపల్లి, కోటం, బనారస్, చికెంకారి, జాంధానీ కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ మహిళలను ఆకట్టుకుంటున్నవి. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం నాడు గుజరాత్ నుండి విచ్చేసిన సిద్ధి దమల్ జానపద నృత్యం శ్రీ హనీఫ్ ముబ్బబుల్ మీయవ అలరించింది. శ్రీమతి పద్మ కళ్యాణ్ ఆధ్వర్యం లో శంభు కింకిణి డాన్స్ ఫెస్టివల్ రెండవ రోజు అస్సాం నుండి విచ్చేసిన డాక్టర్ మోనిష దేవి గోస్వామి తన శిష్య బృందం చే సత్రియా నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీమతి దీప నారాయణన్ శశిధరన్ బృందం ఆధ్యాత్మ రామాయణ కీర్తన నృత్య రూపకాన్ని ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి పద్మ కళ్యాణ్ కళాకారులను సత్కరించారు.



### ఘనంగా ఆటో డ్రైవర్ల ఉపాధ్యక్షులు దేవ్ రాజ్ జన్మదిన వేడుకలు...

### ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్....

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆటో డ్రైవర్ల ఉపాధ్యక్షులు దేవ్ రాజ్ జన్మదిన సందర్భంగా సహచర యూనియన్ సభ్యులతో కలిసి మసీద్ బండ లోని స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ ని ప్రత్యేకంగా కలిశారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్ కు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. విచ్చేసిన కార్మికులకు భోజనం ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పలు ఆటో సంఘాల నాయకులు,ప్రతినిధులు పాల్గొన్నారు.

# తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్ నుండి నల్లగొండ రోగి ప్రాణాలు కాపాడం

### యశోద ఆస్పత్రి వైద్యులు




మిర్యాలగూడ డిసెంబర్ 23:-( వార్త మిర్రర్) నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంకు చెందిన మహిళా చల్ల సునీత తీవ్ర బ్రెయిన్ స్ట్రోక్ తో తమ ఆసుపత్రికి రాగా సకాలంలో స్పందించి వైద్య బృందం వైద్యమందించి ప్రాణాలు కాపాడ గలిగామని మలక్ పేట యశోద ఆసుపత్రి న్యూరో ఫిజిసియన్ కన్సల్టెంట్ సూరిపెట్టి భరత్ కుమార్, న్యూరో, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ హరికిశోర్ కామేపల్లి తెలిపారు. మంగళవారం స్థానిక స్వాగత్ హెూటల్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 37 సంవత్సరాల సునీత స్థానిక ఆసుపత్రిలో గత అక్టోబర్ 26న రాత్రి ఏడున్నర గంటలకు ఎంఆర్ఐ చేసి ఎడమ మిడిల్ సెరెబ్రల్ ఆర్టరీ (ఎంసిఏ) ఉందని గ్రహించి తమ ఆసుపత్రికి రిఫర్ చేశారని దీంతో వచ్చిన వెంటనే ఎంఆర్ఐ, సిటి స్కాన్ చేయగా ఎంసిఏ ఎం 1ఎం3 రక్తనాళాలు పూర్తిగా బ్లాక్ అయ్యి, పలు చోట్ల ఇంఫార్కులు ఉన్నట్లు తేలగ వెంటనే మెకానికల్ త్రాంటీక్టమీ, 24 గంటలు టీరోఫిలోస్ ఇన్ఫ్యూషన్, డ్యూయల్ యాంటీప్లేట్ లెట్ థెరపీ ఐవి మిథైల్ప ప్రైరెడ్నిసోలోస్ వాస్కు లైటీస్ కోసం ఐసియులో నిరంతర పర్యవేక్షణ, బీపీ నియంత్రణ, అత్యవసర చికిత్స నిర్వహించి రోగి స్పందన, సామర్థ్యం మెరుగు పర్చామన్నారు. సకాలంలో చికిత్స అందకుంటే తీవ్ర పక్షవాతం, మాట తప్పే ప్రమాదముండేనన్నారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో అధునాతన వైద్యం అందించి రోగిని కాపాడ గలిగామన్నారు. అత్యంత క్లిష్ట బ్రెయిన్ స్ట్రోక్ తదితర చికిత్సలకు అధునాతన వైద్యం, వైద్య పరికరాలు, వైద్య సేవలు అందించే వైద్యులున్నారని వారన్నారు. కార్పోరేట్ సేవలందించే యశోద ఆసుపత్రిలో సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా సేవలందిస్తామని వారన్నారు. సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర, పిఆర్ఓ ఎ. వాడుకిరణ్ రెడ్డి ఉన్నారు.

# వార్డుల పునర్విభజనలో మానికేశ్వరీ నగర్ బస్తీకి జరిగిన అన్యాయంపై

### కంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్

### అదం సంతోష్ కుమార్ కు వినతి



సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 23.... వార్డుల పునర్విభజన లో భాగంగా మానికేశ్వర్ నగర్ కు తీవ్ర అన్యాయం జరిగిందని విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదం సంతోష్ కుమార్ కు స్థానిక బస్తీ వాసులు, కాంగ్రెస్ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మాణికేశ్వరీనగర్ ప్రాంతవాసుల విజ్ఞప్తిమేము మాణికేశ్వరీ నగర్ ప్రాంతానికి చెందిన నివాసులమని తెలియజేస్తున్నాము. గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా అనుకూలంగా కొనసాగుతున్నామని ఈ సందర్భంగా గౌరవంగా తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వార్డుల పునర్విభజన కారణంగా, తార్నాక డివిజన్ పరిధిలో ఉన్న మాణికేశ్వరీనగర్ ప్రాంతాన్ని సీతాఫలమండి డివిజన్‌లో కలపడం జరిగింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీకి సమీపంలో ఉండడం వల్ల మాణికేశ్వరీనగర్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యత లభించిందని గుర్తుచేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో స్థానికులకే అవకాశం కల్పిస్తూ మాణికేశ్వరీనగర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థికి టికెట్ కేటాయించాలని మేము గౌరవనీయులైన అదం సంతోష్ కుమార్ మనవి చేస్తున్నాము. భవిష్యత్తులో కూడా కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి విధేయతతో కొనసాగుతూ, రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో మీ ఆధ్వర్యంలో పనిచేస్తూ, పార్టీ విజయానికి కృషి చేస్తామని మణికేశ్వర్ నగర ప్రాంత ప్రజలు ఈ సందర్భంగా హామీ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి వరికుప్పల రవి, ఆముల శ్రీనివాస్, ఎ.లింగయ్య, కె.నర్సింహ, జి.వెంకటేష్, అశోక్, ఎ.వెంకటేష్, పి.శంకర్, రవీందర్, చిరంజీవి, షేక్ మక్బుల్, రాజేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

### సందయ్య మెమోరియల్ ట్రస్ట్,ఆర్ కె వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేత

### పట్టుదలతో శ్రమించి చదివితేబి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : పేద విద్యార్థులు బాగా చదువుకోవాలని లక్ష్యంతో గత కొన్ని సంవత్సరాలుగా ఆర్ కే వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేర్లింగంపల్లి నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పదవ తరగతి విద్యార్థి ,విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఫౌండేషన్ చైర్మన్ రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగంపల్లి జడ్. పి. హెచ్. ఎస్ హైస్కూల్, బాలికల పాఠశాలలో దాదాపు 400 మంది విద్యార్థిని ,విద్యార్థులకు పార్లమెంటు సభ్యులకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్ చేతుల మీదుగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎం.పీ. విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయరంగంలో ఎంతోమంది పేదవారికి సహాయ సహకారాలు అందించిన బిక్షపతి యాదవ్ కుటుంబం విద్యారంగంలో కూడా వారికి తోచిన సహాయం ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలలో ఏదో ఒక కార్యక్రమం తీసుకొని విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని, వారు ఉన్నత చదువులు చదువుకుని సమాజానికి, వారి యొక్క కుటుంబానికి మంచి పేరు తీసుకొస్తారని సదుద్దేశంతో ఈరోజు ఉచితంగా పదవ తరగతి చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందించే విషయం అని తెలిపారు. అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులచే రానున్న పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా తయారు చేయించిన గైడ్స్ ని విద్యార్థిని విద్యార్థులు బాగా సద్వినియోగపరచుకుంటారని కోరుకుంటూ, భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు తీసుకొని ట్రస్టు సేవలు అందిస్తామని సమముఖంగా తెలుపుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన వారికి పై చదువుల కోసం మా ట్రస్టు ద్వారా ఆర్థిక సహకారం అందిస్తామని ట్రస్ట్ యాజమాన్యం బిక్షపతి యాదవ్ రవికుమార్ యాదవ్ విద్యార్థిని ,విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి,బల్వంత్ రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి ,వసంత్ యాదవ్, ఎల్లేష్, రామరాజు, కేశవ్, మనోహర్, లక్ష్మణ్, కిషోర్ ,రాజు శెట్టి, శ్రీనివాస్ రెడ్డి ,రామ్ రెడ్డి, సునీల్ రెడ్డి, హనుమంతు నాయక్ ,గోపాల్ రావు, సీతారామరాజు, వెంకటేష్ ,నర్సింగ్ రావు ,రాజేష్ గౌడ్, గణేష్, జితేందర్, వినోద్ యాదవ్ ,సోమయ్య, బాబు , వీరు యాదవ్ ,రాము, శ్రీనివాస్, వేణు, అజయ్, పద్మ, విజయలక్ష్మి, జ్యోతి, లక్ష్మీ ,భాగ్యశ్రీ, మీనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు, బాల కార్మికుల సంఖ్య పెరుగుతున్నాయి వీరికి తగ్గించాల్సిన బాధ్యత





ప్రతి ఒక్కరిపై ఉంది మిర్యాలగూడ డిసెంబర్ 23:- (వార్త మిర్రర్) సమాజం లో బాల్య వివాహాలు చాల జరుగుతున్నాయని అదేవిధంగా బాల కార్మికుల సంఖ్య కూడా చాలా ఎక్కువ మొత్తంలో ఉన్నదని దాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ మీటింగ్ హాలులో పట్టణ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ అయిన కమిషనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెల మొదటి శుక్రవారం ఈ కమిటీలో ఉన్నవారు ప్రతి అంశం గురించి చర్చించుకోవాలని చెపారు. పిల్లల విషయంలో చట్టబద్ధంగా ప్రతి వాడిలో పరిరక్షణ కమిటీలు బాధ్యతలు తీసుకోవాలని అన్నారు అదేవిధంగా పిల్లలను చట్ట పరంగా తీసుకున్న ఎవరైనా దత్తత తీసుకోవాలంటే ఐసిడిఎస్ వాళ్లకు అప్లికేషన్ పెట్టుకోవాలని చెప్పారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. అదేవిధంగా వాళ్ల పరిరక్షణ కమిటీలో ఉన్న మెంబర్లు అందరూ కచ్చితంగా బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్, ఆర్ఓ జి.జ్ఞానేశ్వరి డీసీపీయూ వీ రమణి మెప్మా టిఎంసి పి.బక్కయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిహెచ్ పద్మ, లీలాకుమారి, నజీమాబేగం నాగమణి,పద్మా, సివోలు శ్రీనివాస్ వెంకటేశ్వర్లు సతీష్ పర్సన్స్ వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు

## ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన అడవి పంది యువకుడు మృతి



డిండి డిసెంబర్ 23 వార్త మిర్రర్ ::::::

డిండి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మన్నెముని విజయ్ 25 సంవత్సరాలు మరియు తన బంధువైన చింతకుంట్ల కృష్ణయ్య 55 సంవత్సరాలు తో కలిసి ఎర్రగుంటపల్లి గ్రామంలో వారి బంధువుల ఫంక్షన్ కు వెళ్లి మన్నెముని విజయ్ నడుపుతున్న హెూండా షైన్ మోటార్ సైకిల్ టీఎస్ 31 ఈ 3035 పై తిరిగి వస్తుండగా వావిల్ కుల్ గ్రామ శివారులో ఆకస్మికంగా రోడ్డుపైకి అడవి పంది రావడంతో అదుపుతభి కిందపడి తలకు బలమైన గాయం తగలగా విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు అతని వెనుక సీటులు కూర్చున్న చింతకుంట్ల కృష్ణయ్య కు వెన్నుముక భాగంలో తీవ్రమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు ఎస్సై సిహెచ్ బాలకృష్ణ డిండి పోలీస్ స్టేషన్ లో తల్లి నరసమ్మ కంప్లైంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి దేవరకొండకు తరలించడం అయినది తదుపరి చట్టపరమైన చార్యులు తీసుకుంటామని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ హెచ్ ఓ డిండి పోలీస్ స్టేషన్ నల్గొండ తెలిపారు.



## తెల్దేవరపల్లి ఉపసర్పంచ్ విజయ శాంతి గణేష్ సన్మానించిన కెటీఆర్

చందంపేట డిసెంబర్ 23 వార్త మిర్రర్ :చందంపేట మండలం లోని తెల్దేవరపల్లి గ్రామపంచాయతీ మూడో విడత జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన ఉప సర్పంచ్ బొంగురాల విజయశాంతి గణేష్ ను నల్లగొండ జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ లు ఆత్మీయ సమ్మేళన సభ సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ . తారక రామారావు (కేటీఆర్) మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీందర్ కుమార్ .మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్. కేతావత్ బిలియా నాయక్ . టి.ఎన్.రెడ్డి చేరుకు సుధాకర్ .రాజ వర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అల్లీపూర్ లో రైతులకు ఘనంగా సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 23

జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లో గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమీ -వెంకటేష్, ఉప సర్పంచ్ గురులింగు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ రైతు సోదరులను ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మహేష్ స్వామి నివాసంలో అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ డిసెంబర్ 23..నార్త్ లాలాగూడ లోని మహేష్ స్వామి నివాసంలో అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. రమేష్ గుప్త గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పకు అభిషేకం, అయ్యప్ప పడిపూజలో వారి బృందం పాల్గొని స్వామి కీర్తనలు పాడుతూ భజనలు చేస్తూ తన్మయత్వం పొందారు. పూజలోమహేష్ స్వామి కుటుంబ సభ్యులు మమత, రుత్విక్ యశ్వంత్,రమేష్ గుప్తా గురుస్వామి బృందం స్వాములు ఎల్.ఎల్.బి శ్రీను, రైల్వే శ్రీనివాస్, సాయి, స్వరాజ్, చరణ్ గౌడ్, బాబా అశోక్,శ్రీను మామ, సింగం రవి, బుల్లెట్ భాస్కర్, మల్లికార్జున్, వీరప్ప, మదన్ చారి, మహేష్, గోపి, తరుణ్, లలిత్‌తో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 23

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని అన్న మెమోరియల్ హై స్కూల్ అన్న ఇన్నోటివ్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా విద్యార్థులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఫాదర్ చిన్నపరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దేవుని ప్రేమ గురించి చెప్పి విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆ దేవుని ప్రార్థించారు విద్యార్థులు ఈ వేడుకల్లో క్రీస్తు జన్మకు సంబంధించిన నాటకాలను నృత్యాలను ప్రదర్శించి ఆహ్వానితులను తోటి స్నేహితులను అలరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేనేజర్ ఫాదర్ చిన్నపరెడ్డి పాఠశాల ప్రిన్సిపాల్ సునీత మేడం రాని మేరీ మేడమ్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాలుపంచుకున్నారు.



# ట్రినిటీ హైస్కూల్లో జాతీయ రైతు దినోత్సవం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 23

చౌటుప్పల్ పట్టణం కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటి జోన్ లో విద్యార్థులకు రైతు వేషధారణ చేసి పంట పొలాల పనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రినిటీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు రైతులు పండించే వివిధ రకాల పంటలు ఎలా పండుతాయో అవగాహన కల్పించారు. విద్యార్థులకు రైతు వేషధారణ వేయించి నాగలి ఎడ్లబండ్లు వివిధ రకాల కూరగాయలు ప్రదర్శన చేసి విద్యార్థులకు రైతులు చేసే పని గురించి వివరించి చెప్పారు అలాగే నీటిని పొదుపు చేసే ప్రక్రియ గురించి వివరించారు అలాగే విద్యార్థులు తినే ఆహారము వ్యర్థం చేయవద్దని తెలిపారు. విద్యార్థుల చేత రైతులను గౌరవించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు,ఉపాధ్యాయులు అనూష,చందన,జ్యోతి, శిరీష, అనసూయ,సంతోష, రాణి, హారిక, రత్న,భార్గవి, సింధు, లావణ్య, తదితరులు పాల్గొన్నారు..